బీఆర్ఎస్‌కే జై కొట్టిన స్థానికేతరులు

● పచ్చతమ్ముళ్ల అత్యుత్సాహం ● పరేషాన్‌లో కేడర్

కూకట్‌పల్లి: నగరం, నగర శివారు ప్రాంతాల్లో నివాసముండే ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన సెటిలర్స్ పూర్తి స్థాయిలో బీఆర్ఎస్ పార్టీకే జై కొట్టారు. స్థానికేతరులు ఎక్కువగా నివాసముండే కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో సగానికి పైగా సెటిలర్స్ నివాసముంటున్నారు. ఈ ప్రాంతంలో పక్క రాష్ట్రాల వారు ఉండే నాయకత్వాలు అసత్య ప్రచారాలు చేసి అధికార పార్టీపై విమర్శనాస్త్రాలు చేసినప్పుడు ఇక్కడ ఉండే సెటిలర్స్ ఏ మాత్రం స్పందించ లేదు. కానీ కొన్ని సామాజిక వర్గాలు అప్పటికప్పుడు స్పందించి అధికారపార్టీని ఓడిస్తామని ప్రగల్భాలు పలికిన వారు మళ్లీ బీఆర్ఎస్‌కే జై కొట్టారు.

◆ నగరంలో సెటిలర్స్‌కు ఎలాంటి ఇబ్బంది లేకపోవటమే కాకుండా గడిచిన 10 సంవత్సరాల్లో శాంతి భద్రతల విషయంలో, అభివృద్ధి విషయంలో ప్రభుత్వంపై విమర్శ లేకపోవటం కారణమని పలువురు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా వంటి మౌలిక వసతుల విషయంలో ఉద్యోగస్తులు ఐటీ ఉద్యోగులు సంతృప్తి వ్యక్తం చేయటంతో అధికార పార్టీకి నగర శివారు ప్రాంతంలో ఢోకా లేకుండా పోయింది.

◆ నగర శివారు ప్రాంతంలో ఉన్న అన్ని నియోజకవర్గాల్లో భారీ మెజార్టీతో విజయం సాధించటం ఇందుకు సాక్ష్యం. కాంగ్రెస్ పార్టీకి జిల్లాల నుంచే భారీ స్పందన రావటంతో పార్టీకి మద్దతు పలుకుతున్నామని పలు కుల సంఘాలు పేర్కొన్నారు. అయినా ఆ సంఘాలు పూర్తిస్థాయిలో కాంగ్రెస్‌కు మద్దతు తెలపకపోవడంతో పార్టీ అభ్యర్థులు ఓడిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీకి జిల్లాల నుంచే భారీగా మెజార్టీ రావటంతో ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన వారు తోక ముడిచినట్లు తెలుస్తోంది.

పచ్చతమ్ముళ్ల పరేషాన్..

◆ తెలంగాణలో ఉనికే కోల్పోయిన తెలుగుదేశం పార్టీ నాయకులు ఏ పార్టీ ప్రచారం చేసినా ఆ పార్టీలో తమ జెండాలను పట్టుకొని ప్రచారానికి దిగి ఆభాసుపాలయ్యారు. నగర శివారు ప్రాంతంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ప్రతి పార్టీ ప్రచారంలోనూ జెండాను పట్టారు. అయితే కాంగ్రెస్ పార్టీకి తాము మద్దతంటూ ప్రచారం చేస్తూ బహిరంగంగా ప్రచారం చేసినప్పటికీ ఆ పార్టీకి ఒరిగిందేమీ లేదని తేలిపోయింది.

◆ మరోవైపు జనసేన మద్దతంటూ ఆ పార్టీలో కూడా జెండాలు ఎత్తి తిరిగారు. అక్కడ కూడా డిపాజిట్లు గల్లంతవటంతో జనసేన కంటే ముందు తెలుగుదేశం పార్టీనే అభాసుపాలయ్యింది. ఇదిలా ఉండగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి కూడా జెండాలు వేసుకొని తిరిగారు.

◆ ఏ పార్టీ గెలిస్తే ఆ పార్టీయే తమ వల్లే గెలిచిందంటూ భుజాలు తడుముకొనే పచ్చ తమ్ముళ్లు నగరంలో బీఆర్ఎస్ పార్టీకి పనిచేసినట్లుగా ఆత్మస్థైర్యంతో చెప్పుకోగలుగుతారా అని పలువురు రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. పచ్చ పార్టీ ఉనికి లేని ప్రాంతంలోనే కాంగ్రెస్ విజయం సాధించిందనేది తెలిసినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజయానికి అన్ని తామేనంటూ పచ్చతమ్ముళ్లు చెప్పుకోవటంపై పలువురు ఎగతాళి చేస్తున్నారు.

కూకట్‌పల్లి ప్రజలకు రుణపడి ఉంటా

ముమ్మారెడ్డి ప్రేమకుమార్

కూకట్‌పల్లి: జనసేన–బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్న తనకు సుమారు 40వేల ఓట్లతో మద్దతు తెలిపిన కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమకుమార్ అన్నారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో తన తరపు ప్రచారానికి వచ్చిన జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు అగ్ర నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఎన్నికల్లో గెలుపోటములు సమానంగా స్వీకరిస్తూ ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తూనే ఉంటానన్నారు. పోటీలో ఓడిపోయినా నిత్యం ప్రజలతోనే ఉంటానని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలు, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు తనపై చూపిన అభిమానాన్ని జీవితంలో మర్చిపోలేనన్నారు. తనకు సహకరించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు.

రాజాసింగ్‌కు అసెంబ్లీ చిత్రపటం బహూకరణ



రాజాసింగ్‌కు అసెంబ్లీ నమూనా చిత్రపటాన్ని బహూకరించిన ఉప్పల దామోదర్ నేత

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ తులసీనగర్ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు ఉప్పల దామోదర్ నేత ప్రతి ఎన్నికలో గెలుపొందిన వారికి తెలంగాణ అసెంబ్లీ నమూనా చిత్రపటాన్ని బహుమతిగా ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా సోమవారం గోషామహల్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన రాజాసింగ్‌ను కలిశారు. ఈ సందర్భంగా అసెంబ్లీ నమూనా చిత్రపటాన్ని అందజేశారు. హ్యాట్రిక్ సాధించిన సందర్భంగా పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ రమణ తదితరులు ఉన్నారు.

అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు





ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి శుభాకాంక్షలు తెలుపుతున్న దొడ్ల రామకృష్ణగౌడ్, ఆల్విన్‌కాలనీ సొసైటీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యేగా మూడోసారి గెలిచిన అరెకపూడి గాంధీకి సోమవారం కార్పొరేటర్‌లు, పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మాట్లాడుతూ.. తాను 10 సంవత్సరాల కాలంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, పలు సంక్షేమ పథకాలను చూసి ప్రజలు మళ్లీ తనకు హ్యాట్రిక్ మెజార్టీ అందించారన్నారు. తనకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికి, నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా క్రీక్ ప్లానెట్ వార్షికోత్సవాలు

ముఖ్య అతిథిగా శాస్త్రవేత్త డాక్టర్ నేహా హెబాల్కర్





సాక్షి, సిటీబ్యూరో: పిల్లలకు సమాజంపై అవగాహన కల్పిస్తూ.. వారికి నచ్చిన రంగంలో ముందుకు తీసుకెళ్లాలని శాస్త్రవేత్త డాక్టర్ నేహా హెబాల్కర్ సూచించారు. క్రీక్ ప్లానెట్ స్కూల్ నెప్ట్యూన్ క్యాంపస్ ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలోని కైత్లాపూర్ గ్రౌండ్ వేదికగా నిర్వహించిన వార్షికోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు శాస్త్ర సాంకేతిక అంశాలపైన మాట్లాడారు. 'కాస్మిక్–లామ్–బి– గస్ ద వే అహెడ్' ఇతివృత్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో విజ్ఞాన శాస్త్రం గొప్పదనాన్ని తెలియజేసేలా విద్యార్థులు పలు కళా ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ వార్షికోత్సవాలలో వైస్ చైర్మన్ పాండురంగాచారి, హెచ్ఎం చెంపాఘోషల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.




మాధవరం కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాక్కాల సత్యనారాయణ, పిట్ల రాజు

కృష్ణారావుకు శుభాకాంక్షలు





కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్



కృష్ణారావుకు శుభాకాంక్షలు తెలిపిన కూకట్‌పల్లి గ్రామానికి చెందిన నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా మూడోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు... బీఆర్ఎస్ కార్యకర్తలకు మాధవరం కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గడిచిన రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా మీ ఆదరాభిమానాలతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేశానన్నారు. తనపై నమ్మకంతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు మరోమారు ధన్యవాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. మాధవరం కృష్ణారావును కార్పొరేటర్లు, కార్యకర్తలు సోమవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.





శుభాకాంక్షలు తెలుపుతున్న అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం, దొడ్ల రామకృష్ణగౌడ్, మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్

9 నుంచి చేనేత వస్త్ర ప్రదర్శన

శ్రీనగర్‌కాలనీ: శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఆధ్వర్యంలో శారీస్ ఆఫ్ ఇండియా పేరిట చేనేత వస్త్ర ప్రదర్శనను ఈ నెల 9 నుంచి ఐదు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వినయ్‌కుమార్, శ్రీనివాసరావు తెలిపారు. నాణ్యమైన, ఎక్కడా దొరకని బెనారస్ పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చేనేత కళాకారుల కళా ఉత్పత్తులైన సిల్క్, కాటన్ వస్త్రాలతో పాటు డిజైనరీ చీరలు, ఫ్యాన్సీ వస్తువులు అందుబాటులో ఉంటాయన్నారు. నాణ్యతకు మారుపేరైన సిల్క్ గ్యాలరీలోని వస్త్రాలను మహిళలు సందర్శించాలని కోరారు.

ముగిసిన శతచండీ యాగం

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో కొలువుదీరిన శ్రీ విజయగణపతి దేవాలయంలో లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్న శతరుద్రయాగ సహిత శతచండీ మహాయాగం సోమవారం ముగిసింది. వేడుకల్లో భాగంగా ఉదయం శతచండీ రుద్రహోమాలు, చంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకం వైభవంగా జరిగాయి. అనంతరం మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఈ వేడుకలకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేసి మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. గత నెల 25వ తేదీన ఈ మహాయాగం ప్రారంభమైంది.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 40, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 13, క్యారెట్ 33, దొండ 28, గుండుబీన్స్ 40, గింజ చిక్కుడు 40, గోకరకాయ 28, కీర 18, దోసకాయ 23, బీట్‌రూట్ 31, ఉల్లిగడ్డ 34, ఆలుగడ్డ 23, చామగడ్డ 38, మొరంగడ్డ 21, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 13, మునగకాయ 4–6, ముల్లంగి 4–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

ఓడినా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తా

కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్



కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ బండి రమేష్

కూకట్‌పల్లి: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 65 వేలకు పైగా ఓట్లు వేసి తనకు మద్దతు తెలిపిన కూకట్‌పల్లి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. బాలానగర్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలతో సామవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ... ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని తాను ఓటమి పాలైనప్పటికీ రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

◆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ అర్హులైన వారికి పథకాలు అందేలా ప్రతి కార్యకర్త ప్రజలకి గుర్తు చేయాలని కోరారు. పోలింగ్ బూత్‌లు, బస్తీల వారీగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు. ఓటమికి అధైర్య పడకుండా పనిచేయాలని కోరారు.

◆ అనంతరం ఎన్నికల్లో ఓటమికి గల కారణాలపై పార్టీ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు గాలి బాలాజీ, సత్యం శ్రీరంగం, పుష్పరెడ్డి, నాగిరెడ్డి, తూము వేణు, యాదగిరి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

పర్మిట్‌రూమ్‌లో వ్యక్తి మృతి

ఓల్డ్ బోయిన్‌పల్లి: హస్మత్‌పేట చౌరస్తాలో ఉన్న విజయదుర్గ వైన్స్ పర్మిట్ రూమ్‌లో అనుమానస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కలకలం సృష్టించింది. డివిజన్ పరిధిలోని ఫ్రెండ్స్ కాలనీలో నివాసం ఉండే సురేష్ (61) కేబుల్ టెక్నీషన్‌గా పని చేసేవాడు. ఆయన సోమవారం సాయంత్రం విజయదుర్గ వైన్స్ పర్మిట్ రూమ్‌లో మద్యం సేవిస్తూ మృతి చెందాడు. ఈ విషయంపై కొంతమంది వైన్స్‌షాప్ యాజమానికి సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌కు కాల్ చేసి అల్వాల్ పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సిబ్బంది అతడిని పరీక్షించగా మృతి చెందినట్లు చెప్పారు. తక్షణమే మరో అంబులెన్స్‌లో గాంధీ మర్చురీకి తరలించారని వైన్‌షాప్ యాజమాని తెలిపారు. పర్మిట్‌రూమ్‌లో సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తే నిజం బయట పడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అల్వాల్ పోలీసులు సీసీ పుటేజీలు పరిశీలించకుండానే వెళ్లిపోయారని స్థానికులు చెబుతున్నారు. గుండెపోటుతో మృతి చెందినట్లు అంబులెన్స్ సిబ్బంది చెప్పారని వైన్‌షాప్ యాజమాని పేర్కొన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం ఈనెల 5న నిర్వహిస్తున్నట్లు వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మియాపూర్ విశ్వనాథ గార్డెన్‌లో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే అభ్యర్థి, జగదీశ్వర్‌గౌడ్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు తరలి రావాలని కోరారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు సౌత్‌జోన్ క్రీడాకారుల ఎంపిక

బాలానగర్: జేఎన్‌టీయూ యూనివర్సిటీలో మెన్స్ హ్యాండ్‌బాల్ పోటీలకు సౌత్‌జోన్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. ఈ ఎంపికకు ముఖ్యఅతిథిగా వీసీ ఓఎస్‌డీ ప్రొ. డా. బాలునాయక్ హాజరయ్యారు. యూనివర్సిటీ పరిధిలోని పలు ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన క్రీడాకారులు ఎంపికలో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్ 24న కేరళలోని కొట్టాయంలో జరిగే ఫైనల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ డా. నల్లగొండ అశోక్ క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయటం చాలా అభినందనీయమని వీసీ అన్నారు. క్రీడాకారులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి సరైన శిక్షణ ఇవ్వటంతో డాక్టర్ అశోక్ పాత్ర కీలకమైనదన్నారు. సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ డాక్టర్ ఎస్ఎస్. దిలీప్ మాట్లాడుతూ.. క్రీడాకారులు యూనివర్సిటీలో ఉన్న ప్రతి సౌకర్యాలను ఉపయోగించుకోవాలన్నారు.

'మానూ'లో ముగిసిన రైస్- 2023

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 'రైస్–2023' అంతర్జాతీయ సదస్సు ముగిసింది. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్‌సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ టెక్నాలజీ, సెంట్రల్ అమెరికాలోని ఎల్ సాల్వడార్‌లోని యూనివర్సిడాడ్ డాన్ బాస్కో సంయుక్త ఆధ్వర్యంలో రెండ్రోజుల 8వ అంతర్జాతీయ సదస్సు 'కాన్ఫరెన్స్ ఆన్ ఇంటలిజెంట్ కంప్యూటింగ్ ఇన్ ఇంజినీరింగ్ (రైస్–2023) ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. హనోయ్‌లోని హనోయ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండస్ట్రీకి చెందిన డాక్టర్ బుయ్ టియోన్‌సన్ 'యూఏవీల కోసం భద్రత తాకిడి వైపు' అనే అంశంపై ప్రసంగించారు. ప్రోగ్రామ్ చైర్మన్ డాక్టర్ విజయేందర్‌కుమార్ సోలంకి, సీఎస్ అండ్ ఐటీ విభాగం కన్వీనర్, హెడ్ ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ ముగింపు సమావేశంలో మాట్లాడుతూ.. రెండ్రోజుల పాటు దిగ్విజయంగా ఈ సదస్సును నిర్వహించామన్నారు. మొత్తం 106 పేపర్లలో 46 ఆమోదించబడ్డాయని, అధికారిక ప్రక్రియల కోసం 22 ఎంపిక చేయబడ్డాయన్నారు. డాక్టోరల్ సింపోజియంలో ప్రదర్శన కోసం అదనంగా 24 ఎంపిక చేయబడ్డాయన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ గీతాపట్టున్, ప్రొఫెసర్లు ప్రసంగించారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి

రాయదుర్గం: ఖాజాగూడలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ గచ్చిబౌలి డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా నాయకత్వంలో నేతలు మర్యాదపూర్వకంగా సమావేశమై భవిష్యత్తు పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయినప్పటికీ స్థానికంగా ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ ఘన విజయం సాధించినా.. ఎలాంటి సమస్యలు ఉండవని పార్టీని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెడదామని నిర్ణయించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. నాయకులు, కార్యకర్తలు అంతా ప్రజలకు చేరువలో ఉంటూ.. వారి సమస్యలను అడిగి తెలుసుకుని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు డివిజన్‌లో మెజార్టీ సాధించడం పట్ల హర్షం వ్యక్తంచేస్తూ.. సాయిబాబాను ఘనంగా సత్కరించారు. బీఆర్ఎస్ నాయకులు చెన్నంరాజు, యాదగిరి, అంజమ్మ, నారాయణతో పాటు పలువురు పాల్గొన్నారు.

'ముస్లిం సమాజానికి కేసీఆర్ సమాధానం చెప్పాలి'

● ముస్లింల సమస్యలను కాంగ్రెస్ పరిష్కరించాలి
● ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి

పంజగుట్ట: కాంగ్రెస్ పార్టీ గెలుపులో ముస్లిం సమాజం తోడ్పాటు ఎంతో ఉందని... పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ముస్లిం సమాజానికి కేసీఆర్ సమాధానం చెప్పాల్సిన 10 ప్రశ్నలు సంధించామని అది ప్రజల్లోకి ఎంతో వెళ్లిందని ఆల్ ఇండియా ముస్లిం రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ షేక్ ఇస్లాముద్దీన్ అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆల్ ఇండియా దళిత ముస్లిం ఎస్సీ రిజర్వేషన్ ఫోరం అధ్యక్షుడు షేక్ సత్తార్ సాహెబ్‌తో కలిసి మాట్లాడుతూ... కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ముస్లింలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడాన్ని తాము ప్రశ్నించామన్నారు. వీటిని ఓ పుస్తకం రూపంలో తీసుకొచ్చి సమాధానం చెప్పాలని ప్రజల్లోకి తీసుకెళ్లినట్లు తెలిపారు. ముస్లిం రిజర్వేషన్లు 12 శాతం ఇస్తామని ఇవ్వకపోవడం, ఉర్దూ రెండవ అధికార భాషగా గుర్తిస్తామన్న హామీ, ముస్లింల శ్మశానాలకు స్థలం కేటాయిస్తానని కేటాయించకపోవడం, కోకాపేటలో ఇస్లామిక్ సెంటర్ ఏర్పాటు చేస్తానని చెయ్యలేదు, మైనార్టీ కార్పొరేషన్ నిర్వీర్యం చేయడం మైనార్టీ గురుకులాలకు శాశ్వత భవనాలు లేకపోవడం, ఇమామ్, మౌజన్‌లకు జీతం పెంచుతామని పెంచకపోవడం, బడ్జెట్‌లో జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించకపోవడం లాంటి 10 ప్రశ్నలు ముస్లిం సమాజంలోకి తీసుకెళ్లి కాంగ్రెస్‌కు మద్దతు పలికినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిం సమస్యలను పరిష్కరించాలని, ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చాలని కోరారు. గత ప్రభుత్వం హయాంలో మూతపడ్డ ప్రభుత్వ స్కూల్స్ తిరిగి ప్రారంభించాలన్నారు. సమావేశంలో అబ్దుల్ షాహిద్, ఖలీల్ అహ్మద్, మజద్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో 'వంద' లక్ష్యం

● 'లక్ష్యం' పేరుతో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
● వేకువజామున చదివించేందుకు ఎంపిక చేసిన టీచర్లతో మానిటరింగ్
● సామర్థ్యంపై విద్యార్థులకు ప్రతి సబ్జెక్టులో పరీక్షలు
● ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో జిల్లా విద్యాశాఖ శ్రద్ధ



సాక్షి, మేడ్చల్ జిల్లా: పదిలో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటి వరకు నిమగ్నమై ఉన్న ఉపాధ్యాయులు.. అవి ముగిసిన నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై శ్రద్ధ తీసుకుంటోంది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని పెంచి, వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా సన్నద్ధం చేసేందుకు 'లక్ష్య' పేరుతో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశారు. ఉపాధ్యాయులకు శిక్షణ పూర్తి చేయడంతో పాటు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నెలాఖరు వరకు సిలబస్ పూర్తి చేసి, జనవరి నుంచి రివిజన్ చేసే ప్రక్రియను కొనసాగించేలా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

108 పాఠశాలల్లో 7 వేల మంది విద్యార్థులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 108 ఉన్నత పాఠశాలలో 7 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి పరిధిలోని మూడు జిల్లాల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే.. కొత్తగా ఏర్పడిన మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2016–17 సంవత్సరంలో 85.22 శాతం, 2017–18లో 87.90 శాతం, 2018–19లో 92.98 శాతం. 2020–21లో 92 శాతం, 2022–23 విద్యా సంవత్సరంలో 87 శాతం ఉత్తీర్ణత సాధించింది. ఈ నేపథ్యంలోనే జిల్లాలోని 108 ప్రభుత్వ హైస్కూళ్లలో ఇప్పటికే డిజిటల్ విద్య అమల్లో ఉంది. గతేడాది పదో తరగతిలో ఎక్కువగా ఫెయిల్ అయినట్లు భావిస్తున్న గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది.

మెరుగైన ఫలితాలే లక్ష్యం

పదిలో ఉత్తమ ఫలితాలు లక్ష్యంగా చర్యలు చేపడుతున్నాం. విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు 'లక్ష్యం'లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అసెంబ్లీ ఎన్నికలు ముగియటంతో ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికతో సిలబస్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈసారి జిల్లా నుంచి పదో తరగతిలో అత్యధిక మార్కులు విద్యార్థులు సాధించేలా కృషి చేస్తున్నాం.

– ఐ.విజయకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా.

విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో..

పాఠశాల పని దినాల్లో ఉదయం వేళల్లో బాలికలకు, సాయంత్రం బాలురకు ఒక గంట అదనంగా ప్రత్యేక తరగతులను నిర్వహించేలా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. వారానికి దాదాపు 12 క్లాసులు బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో నాలుగు క్లాసులు గణితం, ఐదు క్లాసులు సామాన్య శాస్త్రం, మూడు క్లాసులు సాంఘిక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు బోధించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పదో తరగతి విద్యార్థులను ఫిబ్రవరి నుంచి ప్రతిరోజూ ఉదయం 4 నుంచి 5 గంటల వ్యవధిలో ఫోన్ల ద్వారా నిద్రలేపేందుకు కూడా ప్రత్యేక ఉపాధ్యాయులను కేటాయించటంతో పాటు వారి పనితీరును పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికను రూపొందిస్తోంది.